07-03-2025
శుక్రవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 167 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తాం

- విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటు
- విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్
- ప్రైవేటు యాజమాన్యంపైనా బాధ్యత ఉంది
- ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలి
- విద్యార్థుల ఆత్మహత్యలపై మండలిలో నారా లోకేష్



**అమరావతి :**

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాల్సిన అవసరం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై మండలిలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఎవరికైనా బాధాకరం. నేను విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఎవరైనా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడితే.. సొంత పిల్లలకు జరిగినట్లుగా భావించి అధికారులు స్పందించాలని చెప్పాను. మానవతా కోణంలో మనం ఆలోచించాల్సిన అవసరం ఉందని చాలా స్పష్టంగా చెప్పాను. విద్యార్థుల ఆత్మహత్యలకు ఒక ప్యాట్రన్ అంటూ ఏమీ లేదు. 2016లో 6 గురు చనిపోతే..2019లో నలుగురు ...మిగతాది 2 లో

- బలహీన వర్గాలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు
- కల్పించడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు రాష్ట్ర
- మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అలాగే, విద్య, ఉద్యోగ
- రంగాల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని
- మంత్రిమండలి తీర్మానించింది. వచ్చే శాసనసభ సమావేశాల్లో
- ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.
- ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ సిఫారసులను
- మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. దీనిపై శాసనసభలో
- బిల్లును ప్రవేశపెట్టాలని తీర్మానించింది.



# మంత్రిమండలి ఆమోదముద్ర

**జయభేరి, హైదరాబాద్ :**


డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన మంత్రిమండలి సమావేశం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు చేసింది.

తెలంగాణలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) వివరాలు నమోదు చేసుకోవడానికి రెండోసారి ఇచ్చిన గడువు పూర్తయిన నేపథ్యంలో ఆ వివరాల ఆధారంగా మంత్రిమండలి నిర్ణయాలు తీసుకుంది. ఎస్సీ వర్గీకరణపై వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకుని మరోసారి అధ్యయనం చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఎస్సీ వర్గీకరణపై భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండే విధంగా శాసనసభ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (FCDA) కి ఆమోదం. శ్రీశైలం హైవే నాగార్జునసాగర్ హైవే మధ్య ప్రాంతంలో ఓఆర్ఆర్ వెలుపలి నుంచి ఆర్ఆర్ఆర్ బయట 2 కిలోమీటర్ల ప్రాంతం వరకు దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ విస్తరించి ఉంటుంది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కిందకు బదిలీ చేస్తూ తీర్మానించారు. ఫ్యూచర్ సిటీ మొత్తంగా 7 మండలాలు, 56 గ్రామాలతో విస్తరించి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా 90 పోస్టులను మంజూరు చేస్తూ ఆమోదించింది.

హెచ్ఎండీఏ పరిధిని విస్తరించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఆర్ఆర్ఆర్ అవతల 2 కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏను విస్తరించారు. 11 జిల్లాల్లో 104 మండలాల్లో 1355 గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తాయి. మహిళా సాధికారతకు పట్టం కడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 కు కేబినెట్ ఆమోదం. గ్రామాల్లో సెర్ప్ కింద, పట్టణాల్లో మెప్మా కింద ఉన్న మహిళా సంఘాలు ఇకనుంచి ఒకే గొడుకు కింద తెస్తూ తీర్మానం. మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వానికి కనీస వయసును 18 ఏండ్ల నుంచి 15 ఏండ్లకు కుదింపు. అలాగే సంఘాల్లో కొనసాగడానికి గరిష్ట వయసును 60 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు పెంపు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్ట ...మిగతాది 2 లో

## ఎన్టీఆర్ తోడల్లుళ్ళ ఆత్మీయ కౌగిలింత

- విశాఖపట్నంలో వైభవంగా ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ
- ఒకే వేదిక పై నారా దగ్గుబాటి



**విశాఖపట్నం :**

"చంద్రబాబుకు తనకు కు మధ్య ఏదేదో ఉందని రాస్తుంటారు, మాట్లాడుకుంటూ ఉంటారు! ఉన్న మాట వాస్తవమే కానీ, అదే జీవితం కాదు! అది గతం! మేమిద్దరం కలసిపోయాం! ఎటువంటి భేషజాలు లేవు! అందరం మంచిగా ఉండాలి! అందరికి మంచి జరగాలి. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తున్నాను. సమస్యలను అధిగమించడమే జీవితం! ఆశాజనక భవిష్యత్ కోసం కలిశాం! అలా అని రాజకీయాల్లోకి ఏమీ రావడం లేదు. పుస్తకాలు రాసుకుంటూ బతికేస్తాను" అని డా. దగ్గుబాటి వెంకటేశ్వరరావు తన మనసులోని మాటలు వెల్లడించారు. గురువారం విశాఖపట్నం గీతం యూనివర్సిటీ లో డా. దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన "ప్రపంచ చరిత్ర" ...మిగతాది 2 లో



## మార్చి 15 నుంచి హాఫ్ డే స్కూల్స్

**హైదరాబాద్, మార్చి 6:**

సమ్మర్ రాకముందే భానుడు తీవ్ర ప్రతాపం చూపుకున్నాడు. తెలంగాణలో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే వారం నుంచి పాఠశాలు ఒంటి పూట పెట్టాలని నిర్ణయించింది. ఒక విధంగా చెప్పాలంటే విద్యార్థులకు శుభవార్త.ఫిబ్రవరి నుంచి తెలంగాణలో విపరీతమైన ఉక్కపోత మొదలైంది. మార్చి ప్రారంభం నుంచి ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 దాటగానే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండల తీవ్రతకు రోడ్లకు ఇరువైపులా బండ్లు పెట్టుకుని చిన్న చిన్న వ్యాపారాలు అల్లాడి పోతున్నారు. స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల గురించి చెప్పనక్కర్లేదువిద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుంది విద్యాశాఖ. ఈసారి ముందుగా ఒంటిపూట బడులు పెట్టాలనే ఆలోచన చేసింది. రంజాన్ పండుగ నేపథ్యంతో తెలంగాణలో ఉర్దూ స్కూళ్లకు ...మిగతాది 2 లో

## జర్నలిస్టులకు అండగా ఉంటాం




- జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం త్వరలో కొత్త పాలసీ
- మహిళా జర్నలిస్టులు యజమానులుగా ఎదగాలి
- మహిళ పట్ల గౌరవం పెరగాలి
- పాఠ్యాంశాల్లో మహిళల గౌరవం పెంపొందేలా ఉండాలి
- మహిళలని ఆ గౌరపరిస్తే ఏ రకమైన శిక్షలు ఉంటాయనేది అందరికీ తెలియాలి.
- మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 6 :**

తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త పాలసీని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయితి రాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖా మంత్రి ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమం, వైద్యం, అభివృద్ధి, వేతనాల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఒక కొత్త పాలసీ తీసుకురావడానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. "ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్" ఆధ్వర్యంలో జూబ్లీ హిల్స్ లోని సొసైటీ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరైయ్యారు. సొసైటీలోని సీనియర్ మహిళా జర్నలిస్టులను ఆమె సన్మానించారు. సొసైటీ చరిత్రను, జర్నలిస్టుల కోసం సొసైటీ చేస్తున్నకృషిని అధ్యక్ష్యుడు బ్రహ్మండభేరి గోపరాజు ...మిగతాది 2 లో

## రియల్ వార్ గా మారుతున్న ట్రేడ్ వార్

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మంత్రిమండలి ఆమోదముద్ర

శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుకు వీలుగా దేవాదాయ చట్టంలో సవరణలు. 2025, 2030 మధ్య ఐదేళ్లకు గాను టూరిజం పాలసీకి ఆమోదం. రాష్ట్రంలో గుర్తించిన 27 ప్రాంతాలను ప్రత్యేక టూరిస్టు కేంద్రాలుగా తీర్చిదిద్దడం. ఆ ప్రాంతాల అభివృద్ధి చేయడంలో 15 వేల కోట్లకు తగ్గకుండా పెట్టుబడులను రాబట్టేలా పాలసీ. మే నెలలో జరగబోయే మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి వచ్చే అతిథులకు ఏ లోటూ లేకుండా ఏర్పాట్లు. 2024 పారా ఒలింపిక్స్ విజేత దీప్తి జీవాంజికి ప్రభుత్వం ఉద్యోగ కల్పన. రెవెన్యూ గ్రామాలకు 10,954 గ్రామాలకు రెవెన్యూ అధికారుల నియమాకం. పెద్ద గోల్కొండ సమీపంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి 5 ఎకరాల భూమి కేటాయింపు. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 361 పోస్టులకు అనుమతి. అలాగే, గురుకులాలకు మరో 330 పోస్టుల భర్తీకి అనుమతి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని గంధమల్ల రిజర్వాయర్ కెపాసిటీని 4.28 టీఎంసీ నుంచి 1.28 టీఎంసీకి తగ్గించాలని నిర్ణయం. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి గారి నాయకత్వంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని తీర్మానం. పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరక్కుండా ఉద్దేశంతో అఖిల పక్ష సమావేశంలో చర్చించి అందరి అభిప్రాయాలను కేంద్రానికి నివేదించాలని నిర్ణయం.

## జర్నలిస్టులకు అండగా ఉంటాం

మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే ఒక ఉద్యమ ఉత్సాహమని, ఈ రోజుల్లో రకరకాల థీమ్స్ తో మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారని అన్నారు. జర్నలిజంలో పని చేస్తున్న మహిళా జర్నలిస్టులు యజమానులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వార్తల సేకరణలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కుంభకోణాలను బయటికి తీయడానికి కూడా వెనుకాడని ధైర్యవంతులు ఉన్న మీడియా రంగంలో పని చేస్తున్న మహిళలకు సైతం లైంగిక వేధింపులు, వేతనాల్లో అసమానతలు, వివక్షత తప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకం అని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు ఎంతో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. వివిధ రంగాల్లో సక్సెస్ సాధించిన మహిళల కథనాలను విస్తతంగా ప్రచురించి ప్రచారం చేస్తే ఇంకా మంచిది అనీ, మీ కలం ద్వారా మహిళలను మరింత ప్రొత్సహించాలని అంటూ ఆమె కోరారు. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే కథనాలు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఇప్పటి వరకు జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఆడవారి పట్ల గౌరవం అనేది ఇంటినుంచి ప్రారంభం కావాలనీ, ఇంట్లో పిల్లలకు నేర్పాలి, పాఠశాల్లలో గురువులు నేర్పాలి, పాఠ్యాంశాల్లో చేర్పించాలి అనేది తన అభిమతమన్నారు. అలాగే మహిళ అగౌరవపరిస్తే ఏ రకమైన శిక్షలు ఉంటాయనేది కూడా అందరికీ తెలియాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా జర్నలిస్టులను సీతక్క సన్మానించారు. అనంతరం సొసైటీ సభ్యులు, మహిళా జర్నలిస్టులు కలసి సీతక్క ను ఘనంగా సత్కరించారు. గతంలో మూడు కాలనీలకు కలిపి 36 మంది మహిళా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను సొసైటీ కేటాయించిందనీ, ఇంకా వందకు పైగా మహిళా జర్నలిస్టులు వెయింటింగ్ లిస్ట్ ఉన్నారని సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజు మంత్రి సీతక్కకు గుర్తు చేశారు. వారికి కూడా పట్టాలు ఇప్పించే బాధ్యత సీతక్క తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవులపల్లి అమర్, ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మండభేరి గోపరాజు, కార్యదర్శి రవీంద్ర బాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ మసాదె, సంయుక్త కార్యదర్శి డా. చల్లా భాగ్యలక్ష్మి, కోశాధికారి భీమగాని మహేశ్వర్ గౌడ్, ఎంసి మెంబర్ కమలాకరా చార్య తోపాటు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మార్చి 15 నుంచి హాఫ్ డే స్కూల్స్

ఒంటి పూట బడులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో మార్చి సెకండ్ నుంచి అన్ని స్కూళ్లకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది.
ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్లు ఉదయం 8 గంటలకు పాఠశాలలు ప్రారంభమవు తాయి. మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయి. ఏప్రిల్ 23 వరకు ఇదే కంటిన్యూ అవుతాయి స్కూళ్లు. 10వ తరగతి పరీక్షలు జరిగే స్కూళ్లలో మాత్రం మధ్యాహ్నం పూట స్కూళ్లు జరుగుతాయని సమాచారం. అంతా అనుకున్నట్లు జరిగితే ఏప్రిల్ 20 లేదా 25 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం అవుతాయి.ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. తెలంగాణలోని కొన్నిజిల్లాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. వడగాలులు ఉంటాయని ఓ వైపు వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. మధ్యాహ్నం సమయంలో చిన్నారులు, వృద్ధులు సాధ్యమైనంత వరకు బయటకు రావద్దని చెబుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చినా ఎండ వేడిమి నుంచి కాపాడుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నది వైద్యులు సూచన.

**ఉష్ణోగ్రతల్లో మార్పులు 40 డిగ్రీలు పైగానే**

ఏపీ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చాయి. ఎండ వేడితోపాటు వడ గాలులు ఈసారి మార్చిలో మొదలయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లా ఆత్మకూరులో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. ప్రకాశం జిల్లా కొనకనమిట్లలో 40 డిగ్రీలు నమోదు అయ్యాయి. ఇక కడప జిల్లా వేంపల్లి, కృష్ణా జిల్లా కంకిపాడులో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన అడ్డతీగల, దేవీపట్నం, గంగవరం, రంపచోడవరం, పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు వంటి ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గురువారం 143 మండలాల్లో వడగాలులు వీయనున్నాయి. శ్రీకాకుళం జిల్లా 11 మండలాలు, విజయనగరం 11, పార్వతీపురం మన్యం 9, అల్లూరి సీతారామరాజు జిల్లా 6, కాకినాడ 2, తూర్పు గోదావరి 16, పశ్చిమ గోదావరి 16, ఏలూరు 14, కృష్ణా 19, వడగాలులు వీయనున్నాయి. ఎప్పుడూ లేని విధంగా మార్చి మొదటి వారంలో ఎండ 40 డిగ్రీలను దాటేసింది.

## పోసాని కృష్ణ మురళికి ఊరట

✍ జయభేరి, విజయవాడ, మార్చి 6:



ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో నటుడు పోసాని కృష్ణ మురళికి ఊరట లభించింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ సహా వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తూ చేసిన అసభ్యకరమైన కామెంట్స్‌తో పోసానిపై కేసులు నమోదు అయ్యాయి. విశాఖ, చిత్తూరు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌ల్లో కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఆయన్ని విచారించేందుకు ఆయా స్టేషన్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. రెండు జిల్లాల్లో నమోదు అయిన కేసులు కొట్టేయాలని పోసాని కృష్ణ మురళి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన క్వాష్ పిటిషన్లు విచారించిన కోర్టు ప్రస్తుతానికి మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసుల్లో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది కోర్టు. అనంతరం విచారణ సోమవారానికి వాయిదా వేసింది. ఇలాంటి కేసుల్లో ఆర్జీవీకి కూడా ఊరట లభించింది. అమ్మరాజ్యంలో కడప రెడ్లు అనే పేరుతో తీసిన సినిమాపై గుంటూరులో ఆర్జీవీపై కేసు నమోదు అయింది. విచారణకు రావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై రామ్‌గోపాల్ వర్మ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారించిన కోర్టు కేసుల విచారణపై స్టే విధించింది. ఆర్జీవీ వేసిన క్వాష్ పిటిషన్లు విచారించిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 2019లో విడుదలైన సినిమాపై ఇప్పుడు ఫిర్యాదు చేయడమేంటని ప్రశ్నించింది.

# రియల్ వార్ గా మారుతున్న ట్రేడ్ వార్

**గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసిన డొనాల్డ్ ట్రంప్. ఇప్పుడు దేశాన్ని ఆ దిశగా మార్చేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఖర్చుల తగ్గింపుపై దృష్టి పెట్టారు. మరోవైపు వివిధ దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను పెంచుతున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై సుంకాలను 25 శాతం పెంచారు.**




మార్చి 4వ తేదీ నుంచి సుంకాల పెంపు అమలులోకి వచ్చింది. అయితే దీనిపై స్పందించిన చైనా డబ్ల్యూటీసీలో పిటిషన్ వేస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకు ఆదిశగా అడుగు వేయలేదు. దీంతో ట్రంప్.. మొదట సుంక 10 శాతం పెంచుతామని తెలిపారు. ఇప్పుడు దానిని రెట్టింపు చేశారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం స్పందించింది. ఈమేరకు ఎక్స్‌లో ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా చైనాతో సమానంగా సంప్రదింపులు జరపాలని రాయబార కార్యాలయం నొక్కి చెప్పింది. ''ఫెంటానిల్ సమస్యను అమెరికా నిజంగా పరిష్కరించుకోవాలనుకుంటే, ఒకరినొకరు సమానంగా చూసుకోవడం ద్వారా చైనాతో సంప్రదించడమే సరైన పని అని పేర్కొంది. అమెరికా యుద్ధాన్ని కోరుకుంటే, అది సుంకాల యుద్ధం అయినా, వాణిజ్య యుద్ధం అయినా లేదా మరేరకమైన యుద్ధంఅయినా పోరాడటానికి సిద్ధమే' అని పోస్టులు స్పష్టం చేసింది. చైనా దిగుమతులపై సుంకాల పెంపునకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఫెంటానిల్ సమస్యను తోసిపుచ్చింది. తన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి చైనా తీసుకున్న చర్యలు చట్టబద్ధమైనవి, అవసరమైనవని మంత్రిత్వ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు.
అమెరికన్ ప్రజల సద్భావన దృక్పథంతో ఫెంటానిల్ సమస్యను పరిష్కరించడానికి అమెరికాకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా తెలిపింది. కానీ, అమెరికా చైనాపై నిందలు మోపడానికి యత్నిస్తోందని ఆరోపించింది. సుంకాల పెంపుతో చైనాపై ఒత్తిడి, బ్లాక్‌మెయిల్‌చేయడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. వారు తమకు సహాయం చేసినందుకు

> **భారతదేశం, దక్షిణ కొరియా, యూరోపియన్ యూనియన్, చైనా, ఇతర దేశాలు అమెరికా వస్తువులపై విధించిన అధిక సుంకాలను ప్రస్తావించారు. అమెరికా సుంకాలపై చైనా ప్రతిస్పందన మరింత జాగ్రత్తగా ఉంది, కానీ దాని స్పందన తక్కువ కాదు. అమెరికా విధించిన 10% సుంకాలను చైనా 'వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు' అని వ్యాఖ్యానిస్తూ వ్యతిరేకించింది.**

మమ్మల్ని శిక్షిస్తున్నారు. ఇది అమెరికా సమస్యను పరిష్కరించదని స్పష్టం చేసింది.అమెరికా, చైనా మధ్య మొదలైన ట్రేడ్ వార్.. రియల్ వార్‌కు దారి తీస్తుందా అన్న చర్చ జరుగుతోంది. అమెరికా చర్యలకు దీటుగా చైనా స్పందించడం చూస్తుంటే ఎక్కడా తగ్గేది లేదు అన్నట్లుగా చైనా ఉంది.
ఈ నేపథ్యంలో ట్రేడ్ వార్ ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది అమెరికా వ్యతిరేక దేశాలను ఏకం చేస్తుందని అభిప్రాయపడుతున్నారుట్రంప్ పరిపాలన చైనా వస్తువులపై అదనంగా 10 శాతం సుంకాన్ని విధించింది, ఇప్పటికే అమలులో ఉన్న 10 శాతానికి జోడించబడింది. ఈ సుంకాలు అమల్లోకి వచ్చాయి. ఇదే అంశంపై కెనడా, మెక్సికో నుంచి దిగుమతులపై కూడా ఇలాంటి సుంకాలు వర్తింపజేయబడ్డాయి. ఈ చర్యలు వాణిజ్య ఉద్రిక్తతలను పెంచాయి, ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తాయి మరియు ఇప్పటికే దీర్ఘకాలిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటున్న అమెరికన్లకు ఖర్చులను పెంచుతాయి. ఫెంటానిల్, దాని పూర్వగామి రసాయనాల ప్రవాహాన్ని అరికట్టడానికి అగ్ర మూడు యూఎస్ వాణిజ్య భాగస్వాములు తగినంతగా చేయలేదని ట్రంప్ ఆరోపించిన తర్వాత, వార్షిక వాణిజ్యంలో దాదాపు 2.2 ట్రిలియన్లకు అంతరాయం కలిగించే సుంకాలు ప్రవేశపెట్టబడ్డాయి.ఇక తన ఆరువారాల పాలనపై కాంగ్రెస్ ముందు మాట్లాడిన ట్రంప్, ఏప్రిల్ 2న మరిన్ని సుంకాలను అమలు చేస్తామని ప్రకటించారు, వాటిలో 'పరస్పర సుంకాలు' దీర్ఘకాలిక వాణిజ్య అసమతుల్యతలను పరిష్కరించడానికి ఉద్దేశించిన ఇతర నాన్-టారిఫ్ చర్యలు ఉన్నాయి.
'ఇతర దేశాలు దశాబ్దాలుగా మనపై సుంకాలను ఉపయోగిస్తున్నాయి, ఇప్పుడు మన వంతు వచ్చింది' అని ట్రంప్ అన్నారు, భారతదేశం, దక్షిణ కొరియా, యూరోపియన్ యూనియన్, చైనా, ఇతర దేశాలు అమెరికా వస్తువులపై విధించిన అధిక సుంకాలను ప్రస్తావించారు.అమెరికా సుంకాలపై చైనా ప్రతిస్పందన మరింత జాగ్రత్తగా ఉంది, కానీ దాని స్పందన తక్కువ కాదు. అమెరికా విధించిన 10% సుంకాలను చైనా 'వాణిజ్య యుద్ధంలో విజేతలు ఉండరు' అని వ్యాఖ్యానిస్తూ వ్యతిరేకించింది. చైనా ఇంకా పూర్తి స్థాయి ప్రతీకార సుంకాలను ప్రకటించలేదు, కానీ చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ సుంకాలను ప్రపంచ వాణిజ్య సంస్థలో సవాలు చేస్తామని పేర్కొంది, ఇది అంతర్జాతీయ వాణిజ్య నియమాలను ఉల్లంఘిస్తుందని ఆరోపించింది. చైనా అధికారులు 'తగిన ప్రతిచర్యలు' తీసుకుంటామని హెచ్చరించారు, ఇందులో అమెరికా ఉత్పత్తులపై సుంకాలు, ఎగుమతి నియంత్రణలు, లేదా యువాన్ (చైనా కరెన్సీ) విలువను తగ్గించడం వంటివి ఉండవచ్చు.
చైనా ఈ విషయంలో ట్రంప్‌తో సంభాషణల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు, ఎందుకంటే చైనా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే పెద్ద ఎదురుదెబ్బలను ఎదుర్కొంటోంది.ఈ ప్రతీకార సుంకాలు అమెరికా ఎగుమతులను దెబ్బతీస్తాయి, ముఖ్యంగా రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం పడుతుంది. అమెరికాకు కెనడా అతిపెద్ద చమురు సరఫరాదారు కాబట్టి, ఇది ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది: చైనా ప్రతీకారం ఇంకా పూర్తిగా స్పష్టంగా లేనప్పటికీ, గతంలో ట్రంప్ మొదటి పర్యాయంలో విధించిన సుంకాలకు ప్రతిగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు (సోయాబీన్స్ వంటివి) టెక్ ఉత్పత్తులపై సుంకాలు విధించింది.
ఇప్పుడు కూడా ఇలాంటి చర్యలు తీసుకోవచ్చు. అమెరికా: ఈ ప్రతీకార చర్యల వల్ల అమెరికా వినియోగదారులకు ధరలు పెరగవచ్చు, సరఫరా గొలుసులు దెబ్బతినవచ్చు, ఆర్థిక వద్ధి మందగించవచ్చని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల వాణిజ్య యుద్ధం ముదిరే అవకాశం ఉంది.

## ఎన్టీఆర్ తోడల్లుళ్ళ కౌగిలింత

పుస్తక ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, భరత్ పాల్గొన్నారు. ముందుగా రచయిత డా. దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఉద్వేగభరితంగా మాట్లాడారు. భవిష్యత్ తరాల కోసం అనేక గ్రంథాలు అధ్యయనం చేసి ఈ ప్రపంచ చరిత్ర రాసినట్లు తెలిపారు. 30 ఏళ్ల తరువాత తన చేతిలోకి మైకు వచ్చిందని, అందుకే ఎక్కువ మాట్లాడుతున్నా అని వెంకటేశ్వరరావు నవ్వులు పూయించారు. మైక్ ఉందని కాదు గానీ, తనకు తక్కువ మాట్లాడటం, ఎక్కువ వినడం ఇష్టం అని, కానీ, ఇవాళ ప్రముఖుల ముందు, మీ ముందు మాట్లాడే అవకాశం చాలకాలం తరువాత వచ్చిందని, అందుకే మనసులో మాటలు చెప్పుకుంటున్నా అని ఆయన అన్నారు. ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ప్రపంచ చరిత్ర రాశారు సంతోషం. భారతదేశ చరిత్ర వక్రీకరిణ జరిగింది, వాస్తవాలను పరిశోధించి భారత దేశ చరిత్ర రాయమని దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు సూచించారు. ప్రపంచ చరిత్ర ను సరళమైన భాషలో పుస్తకరూపంలో తీసుకురావడం సంతోషకరం అభినందనీయం అన్నారు. అమ్మ భాష కళ్ళు అయితే, కళ్ళజోడు ఆంగ్ల భాష అని, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే వచ్చేలా చూడాలని చంద్రబాబును కోరారు. తాను పదవీ విరమణ మాత్రమే చేశానని, పెదవి విరమణ చేయలేదని చెప్పారు. పొలిటికల్ రిటైర్డ్ మాత్రమే కానీ నాట్ టైర్డ్ అన్నారు. చంద్రబాబు పరిపాలనాదక్షుడు, అభివృద్ధి కాముకుడు అని అభినందించారు. నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు లోతైన అధ్యయనంతో అద్భుతంగా ప్రపంచ చరిత్ర రాశారని, ఆయన రచయిత కానీ రచయిత అని, గొప్ప సాహసం చేశారని అభినందించారు. ఇద్దరం ఎన్టీఆర్ దగ్గర కలసి పని చేశామని, ఎన్టీఆర్ తో స్ఫూర్తి పొందామన్నారు. వెంకటేశ్వరరావు డాక్టర్ ప్రాక్టీస్ చేయకుండా వైద్య మంత్రిగా ప్రాక్టీస్ చేశారని కొనియాడారు. డాక్టర్ అయి సినిమాలు కూడా తీసారని నవ్వించారు. ఎన్ని కష్టాలున్న తమ కుటుంబంలో జోవియల్ గా హ్యాపీగా సంతోషంగా కనిపించే ఒకే ఒక వ్యక్తి వెంకటేశ్వరరావు అని అభినందించారు. ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన వ్యక్తి ప్రస్తుతం పిల్లలతో ఆడుకోవడం, స్నేహితులతో విదేశీ షికార్లు, మధ్యాహ్నం పేకాటతో సంతృప్తికర జీవితం గడుపుతున్నారని ప్రసంశించారు. దగ్గుబాటి ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేస్తారని, అందుకు నిదర్శనం ప్రపంచ చరిత్ర పుస్తకం అని, ఆయన రాస్తారని ఊహించలేదన్నారు. ఈ పుస్తకం గురించి దగ్గుబాటి చాలా చెప్పారని, ఇంకా తాను చదవలేదని, అందుకే తనకు పూర్తిగా అర్థం కాలేదని, సమయం చూసుకుని తప్పకుండా చదువుతానని చంద్రబాబు అన్నారు. చరిత్ర ను వక్రీకరించకుండా ఉన్నది ఉన్నట్లు రాసానని చెప్పారు, ఇది అద్భుత పుస్తకం, ప్రతి ఇంట్లో ఉండాల్సిన పుస్తకం అని మెచ్చుకున్నారు. నిర్మల సీతారామన్ మాట్లాడుతూ గెలిచిన వాళ్ళు చరిత్ర సరిగ్గా రాయగలరని, ఓడిన వాళ్ళు వక్రీకరిస్తారని, చరిత్ర రాయడం చాలా క్లిష్టం అన్నారు. ప్రపంచ చరిత్ర వాస్తవాలను వెంకటేశ్వరరావు పూర్తిగా ఔపాసన చేసుకుని నిమగ్నమై స్పష్టంగా రాసారని, చదవాలనే ఆసక్తి పెంచారని అభినందించారు. ఐదు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు ఎంపి గా చేసిన వెంకటేశ్వరరావు తన జీవితాన్ని తన కిష్టంగా మలచుకున్నారని ప్రసంశించారు. భారత దేశ చరిత్ర రాసిన వాళ్ళు సరిగా రాయలేదని, రాసిన మంచి పుస్తకాలు మాత్రం పాపులర్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో మంచి చెడు వుంటాయని, వాటిని చెప్పే ధైర్యం రాయగల సత్తా రచయితకు ఉండాలన్నారు. రాజకీయంగా సామాజికంగా సినిమా పరంగా విజయం సాధించిన గొప్ప కుటుంబం ఎన్టీఆర్ కుటుంబం అని, ఇప్పుడు చరిత్రను తీసుకొచ్చి రచయితగానూ విజయం సాధించి ఒక చరిత్ర సృష్టించారని అభినందించారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తాం

చనిపోయారు. 2021లో 7గురు చనిపోయారు. 2022లో 12 మంది, 2023లో 17మంది, 2024లో 6గురు చనిపోయారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయనే ప్యాట్రన్ లేదు. అయితే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కాదని ఎవరూ అనడం లేదు. ఇవన్నీ ఇంటర్ విద్యలో చోటుచేసుకున్నవి. టెక్నికల్ ఎడ్యుకేషన్ విషయానికి వస్తే.. ఒకేడాది ఒకరిద్దరు చనిపోతే, మరో ఏడాది 11 మంది, మరో ఏడాది ఒకరు చనిపోయారు. దీనికి ప్యాట్రన్ లేదు. యూనివర్సిటీల్లో కూడా ఆత్మహత్యలు జరిగాయి. 2014 నుంచి 18 మంది చనిపోయారు.

**విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటు**

స్కూల్ వెల్ నెస్ టీమ్స్ ఏర్పాటుచేసి ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఓరియంటేషన్ ఇచ్చి ఎర్లీయర్ సింప్టమ్స్ ను క్యాచ్ చేయాల్సిన అవసరం ఉంది. కేవలం జూనియర్ కాలేజీల నుంచి విశ్వవిద్యాలయాల వరకే కాకుండా పాఠశాల విద్యలో కూడా లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. స్కూల్ ఎడ్యుకేషన్ లో కూడా సుమారు 280 మంది కౌన్సిలర్స్ ను నియమించాం. వారు ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇచ్చి ఎర్లీ సింప్టమ్స్ ను, పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించి, సరిచేయడంతో పాటు ప్రాపర్ కౌన్సిలింగ్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆత్మహత్యల నివారణకు అమెరికాకు చెందిన క్యూపీఆర్ ఇన్ స్టిట్యూట్ వారు బెంగళూరులో ఓ పార్ట్ నర్ తో ఒప్పందం చేసుకున్నారు. స్కూల్ కౌన్సిలర్ ట్రైనింగ్ కోసం గైడెన్స్, ఇంటర్వెన్షన్, క్రైసిస్ సపోర్ట్ మేనేజ్ మెంట్ కు వారితో సంప్రదిస్తున్నాం. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం టెలీ కౌన్సిలింగ్ సర్వీస్ ఏర్పాటుచేస్తాం. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విషయానికి వస్తే.. మెంటర్ మెంటీ సిస్టమ్ కూడా తీసుకురావడం జరిగింది. ఎన్‌సీసీ, రెడ్ క్రాస్ ను కూడా పాఠశాల విద్యలో తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎన్ సీసీ డైరెక్టరేట్ ఇవ్వాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారిని కూడా కోరడం జరిగింది. రెప్యుటెడ్ ఎన్జీవోస్ తో ఒప్పందం కుదుర్చుకుని ఆత్మహత్యలు నివారించాలని, పిల్లల్లో ఎర్లీ సింప్టమ్స్ ను గుర్తించాలని మా అధికారులకు కూడా చెప్పడం జరిగింది.

**ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేస్తాం**

విద్యార్థులు ఒత్తిడిలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆత్మహత్యలకు ర్యాగింగ్, అకడమిక్ స్ట్రెస్, ఫీజు చెల్లింపులు ప్రధాన కారణం. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ తీసుకువచ్చారు. అక్కడ సబ్జెక్స్ టీచర్స్ ను ఇవ్వాలి. మండలానికి ఒక గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఉండాలి. మేం ఇంటర్ విద్యార్థులకు కిట్ తో పాటు మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభించాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

**ప్రైవేటు యాజమాన్యంపైనా బాధ్యత ఉంది**

తల్లిదండ్రులు కూడా ఫీజు కట్టాం కాబట్టి అన్ని సబ్జెక్ట్‌ల్లో మార్కులు రావాలని ఒత్తిడి పెడుతున్నారు. ఒత్తిడి తగ్గించేందుకు కూడా ఆలోచన చేస్తున్నాం. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు తీసుకువచ్చాం. కొత్త అవకాశాలు కల్పిస్తున్నాం. కరిక్యులమ్ రీవ్యాంప్ చేస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నాం. ఆత్మహత్యలు చోటుచేసుకోవడం చాలా తీవ్రమైన అంశం. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు, గవర్నమెంట్ ఇద్దరికీ కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు యాజమాన్యంపై కూడా బాధ్యత ఉంది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని వాకబు చేస్తున్నాం.

## చేయి జారిన సిట్టింగ్ సీటు

✍ జయభేరి, హైదరాబాద్:

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిగ్ షాక్ తగిలింది తాజాగా జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోయింది. అందులో సిట్టింగ్ స్థానం కోల్పోవడం రేవంత్ సీటుకు ఎసరు తెచ్చేలా ఉంది. దేశ వ్యాప్తంగానే కాకుండా తెలంగాణలో కూడా రేవంత్ రెడ్డి సర్కారు పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోన్న ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదు. తాజాగా జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్కంటే ఒక్క సీటు కూడా అధికార పార్టీ కైవసం చేసుకోలేక పోయింది. ఇక బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నా, ఆ పార్టీ ఓటర్లు.. కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదనే విషయం స్పష్టమైంది. ఇక తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకం తీసుకున్న ఈ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీని ఛీ కొట్టారనే చెప్పాలి.
ఉమ్మడి కరీంనగర్ఆదిలాబాద్‌నిజామాబాద్‌మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఈ స్థానాన్ని భారతీయ జనతా పార్టీ దక్కించుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిపై బీజేపీ అభ్యర్థి విజయ బావుటా ఎగరేసారు. ఇది అధికార కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ సీటు కావడంతో విమర్శలు ఎదుర్కొంటోంది.
ఆరేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నెగ్గిన కాంగ్రెస్‌కు ఇప్పుడు అధికారంలో ఉన్నా ఎదురుదెబ్బ తగిలింది. సిటింగ్ స్థానం కావడం.. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున తప్పనిసరిగా గెలిచి తీరాలని అధిష్ఠానం పీసీసీకి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసినా చివరికి ఓటమి తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలను పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు ఓటర్ల దగ్గరకు వెళ్లి చెప్పినా ఫలితం లేక పోయింది.దీంతో సీఎం రేవంత్ కు కష్టకాలం మొదలైందనే చెప్పాలి. దీంతో ఆయన పై అసమ్మతి నేతలు ఒక్కొక్కరుగా తిరుగుబాటు చేయడానికి రెడీగా ఉన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను తిప్పికొట్టిన పట్టబద్రులు, విద్యావంతులు

■ 14 నెలల కాంగ్రెస్ పార్టీ కుతంత్ర పాలనను తిరస్కరించిన పట్టభద్రులు

■ బిజెపి విజయాన్ని కట్టబెట్టిన మేధావులకు, పట్టభద్రులకు, పార్టీ కార్యకర్తలకు ధన్యవాదములు

జయభేరి, గజ్వేల్, మర్చి 06 :



తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ రెండింటిని కైవసం చేసుకున్న సందర్భంగా గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్, ఇందిరా పార్క్ చౌరస్తాలో గజ్వేల్ పట్టణ, మండల శాఖ అధ్వర్యంలో బిజెపి నాయకులు టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహార్ యాదవ్, గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బలాన్ని, ప్రజాదరణను మరోసారి స్పష్టంగా చాటింది. ఈ విజయాన్ని అందించిన తెలంగాణ మేధావులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులందరికీ, ఈ విజయం కోసం శ్రమించిన పార్టీ కార్యకర్తలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆదిలాబాద్నిజామాబాద్కరీంనగర్మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించడం, ఇదే నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య గెలవడం గర్వకారణం అన్నారు. ఈ విజయాన్ని సాధించేందుకు పాటుపడిన మేధావులకు, పట్టభద్రులకు, పార్టీ కార్యకర్తలందరికీ ధన్యవాదములు తెలియజేశారు.రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా.. మేధావులు మొదలుకుని అన్ని వర్గాలు, తెలంగాణ ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారు. తెలంగాణలో బీజేపీ ఓ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిందనడానికి ఈ విజయం ఒక నిదర్శనం. రాష్ట్రంలో అధికారపార్టీ, ప్రతిపక్ష పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, అసత్య ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నం చేసినా, తెలంగాణ ప్రజలు బీజేపీ వెంటే నిలబడ్డారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు చోట్ల బీజేపీ గెలవడం, మరోచోట ఉపాధ్యాయ సంఘం విజయం సాధించడం.. ప్రభుత్వం పట్ల పెరుగుతున్న అసహనానికి, బీజేపీ పట్ల పెరుగుతున్న ఆదరణకు ఓ ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ 14 నెలల కుతంత్ర పాలనను తిరస్కరించిన తెలంగాణ పట్టభద్రులు. బీ.ఆర్.ఎస్ ప్రాక్సీ కాండిడేట్ నూ తిప్పికొట్టిన విద్యావంతులు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్, మనోహరబాద్ మండల బిజెపి అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, గజ్వేల్ సీనియర్ నాయకులు నాయిని సందీప్ కుమార్, మాద్గురి నరసింహా ముదిరాజ్, మైస విజయ్, దువ్వల రాజు, నరేంద్ర చారి, వడ్డేపల్లి ప్రసాద్, తలారి రాజు, దుబ్బకుంట భక్తమాల, వ్యాసభట్టు వేణుగోపాల్, సంగేపు అనిల్, లక్ష్మణ్, సురేష్, ఎల్ల మధు, దుద్దెడ గణేష్, రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ సంబరాలు

జయభేరి, మేడ్చల్ :

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలం చెందిందని అందుకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి అన్నారు. ఉమ్మ డి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ రెండు స్థానాలను కైవసం చేసుకోవడం పట్ల గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మల్కా కొమురయ్య, అంజిరెడ్డి విజయం బీజేపీకి ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఓటర్లు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు తగిన గుణపాఠం నేర్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అమరం మోహన్ రెడ్డి, సముద్రాల కృష్ణ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంజిత్ మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతీ, నాయకులు రవీందర్ గౌడ్, పిడుగుల నాగరాజు, అర్జున్ బాబు, బట్టికడి విక్రమ్, సుంకు నవీన్, మలిగే శ్రీకాంత్, వెంకటేష్, చెంచాల సురేష్, అరుణ్, అభిలాశ్ తదితరులు పాల్గొన్నారు.



## కేశవరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి శంకుస్థాపన

■ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంది - తోటకూర వజ్రేష్ యాదవ్

జయభేరి, మర్చి 05:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని నెరవేరుస్తుందని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో ఆయన పర్యటించారు. అనంతరం ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఇళ్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయల ను మంజూరు చేసిన సందర్భంగా ఇళ్ల నిర్మాణానికి గాను మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మాలపల్లి నర్సింలు యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అదే విధంగా గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని తప్పకుండా నేరవేరుస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, మండల మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లు గొన్న హన్మంతు రెడ్డి, అఖిల్ రెడ్డి, ఉద్దమర్రి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా..

■ 5th CIA MSME EXPO -2025 నీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :




చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక వాడలో చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ఇండస్ట్రీస్ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఆయన అన్నారు. స్టాల్ ఏర్పాటు చేసిన కంపెనీ వారికి అభినందనలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన అన్నారు. 150 కోట్ల తో పారిశ్రామిక వాడలో రోడ్ల కోసం నిధులు మంజూరు చేయించాను అని కన్వెన్షన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. దాని ఏర్పాటు కోసం తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో TIF రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, CIA President గోవింద రెడ్డి, చైర్మెన్ రోషి రెడ్డి, చంద్ర శేఖర్, వెంకట రమణ, మోహన్, మూర్తి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

■ విద్యార్థులే ఉపాధ్యాయులైనవేళ




జయభేరి, వర్గల్, మర్చి 06 :

వర్గల్ మండల పరిధి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నెంటూర్ లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం జరిపారు. అందులో భాగంగా చంద్రా రెడ్డి D.E.O. గా, లాస్య M. E. O. గా, ఎల్లేష్ H.M. గా, అక్షిత, రేవతి, వైష్ణవి, శ్రేయ, అక్షర, సాయిప్రకాష్, రమేష్, అనిల్, రాము, లక్ష్మణ్, రేవంత్, విష్ణువర్ధన్, బిజెందర్, అఖిల్ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ శ్రీ కనకరాజు సార్ గారు నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తును తీర్చి దిద్దే ఉపాధ్యాయులని ఇట్టి అవకాశమును వినియోగించుకున్న విద్యార్థులని ప్రోత్సహించారు. ఇందులో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ధర్మోజీ రమ్య గారు, ప్రధానోపాధ్యాయులు కిష్టయ్య గారు, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సుజాత, రజిత పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అర్థికసాయం




జయభేరి, మర్కుక్, మర్చి 06 :

మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన నాళపల్లి పెంటయ్య (86) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. శుక్రవారం బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ తో కలసి అర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దామరకుంట మాజీ సర్పంచ్ మాధరి గాయిత్రి బాలనర్సయ్య, నాయకులు బి. రాజు, మాదరి రాజు, లింగ యాదయ్య, తదితరులున్నారు.

## త్రిశక్తి క్షేత్రంలో డిసిసి అధ్యక్షులు ప్రత్యేక పూజలు

■ ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

జయభేరి, గజ్వేల్, మర్చి 06 :



మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించగా, డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ దేవతల విగ్రహాల ప్రతిష్టతో గ్రామాల్లో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా భగవాన్ నామస్మరణతో మానసిక ప్రశాంతత దక్కుతుందని, తద్వారా ముక్తికి మార్గం లభిస్తుందని అన్నారు.

గ్రామ దేవతల చల్లని చూపుతో ప్రజలు పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఏటా దేవీ దేవతలను సంతృప్తిపరిచేందుకు పండగ, ఉత్సవాలు నిర్వహించి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు.

కాగా మొదటగా వేద పండితులు రాజశేఖర శర్మ నేతృత్వంలో శ్రీ మహంకాళమ్మ, శ్రీ పెద్దమ్మ, శ్రీ నల్ల పోచమ్మ విగ్రహాలను ప్రతిష్టించడంతోపాటు ప్రాణ ప్రతిష్ట, నేత్రోన్మిలనం, మహా నైవేద్యం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో నాయకులు పూడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, సత్యం, ప్రభాకర్, రాజలింగం, రమేష్ గౌడ్, నక్కరాములు గౌడ్, కన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భాజపా పై నమ్మకంతోనే ఎమ్మెల్సీల గెలుపు

■ మండల మన్ కి బాత్ ఆధ్వర్యంలో సంబురాలు.



జయభేరి, వర్గల్, మర్చి 06 :

ఉమ్మడి మెదక్ కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించడంతో బుధవారం వర్గల్ బీజేపీ మండల మన్ కీ బాత్ కన్వీనర్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు.వర్గల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బద్రీనాథ్, యశ్వంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మణికంత్, సాయి ప్రకాష్, వెంకటేష్ గౌడ్, మహేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలకు అందరు తరలి రండి

■ పున్న వెంకటేష్ నేత



జయభేరి, దేవరకొండ :

ఈనెల 9 న జరగబోయే 17 వ అఖిల భారతీయ పద్మశాలి మహాసభ 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలు హైదరాబాదులో భారీ బహిరంగ సభ పద్మశాలి మహాసభలను విజయవంతం చేయగలరని మహాసభలకు పద్మశాలి బంధువులందరు తరలిరావాలని మహాసభలను విజయవంతం చేయాలని దేవరకొండ పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి పున్న వెంకటేష్ నేత తెలియజేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి చలో మహాసభ అనే నినాదంతో పద్మశాలీలు ఆత్మగౌరవం కోసం పద్మశాలిల హక్కుల కోసం పద్మశాలీలకు రాజాధికారం కోసం జరగబోయే ఈ మహాసభలను ప్రతి ఒక్క పద్మశాలి కుల బంధువులు తరలిరావాలని మహాసభలను విజయవంతం చేసి పద్మశాలిల ఐక్యతను చాటి చెప్పాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేసినారు.

## కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం

జయభేరి, దేవరకొండ :



నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్, దేవరకొండ ఆర్డీఓ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి దేవరకొండ ఆర్డిఓ ఆఫీస్ లో సమీక్ష సమావేశం నిర్వహించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలు వేసవిలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. నిర్మాణ దశలో ఉన్న గొట్టిముక్కల, పెండ్లిపాకల, సింగారాజుపల్లి, కృష్ణరాయణపల్లి, ప్రాజెక్టులకు భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా చర్యలు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పారదర్శకత పాటించేలా ఆదేశాలు. రబీ పంటకు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు తగిన ప్రణాలికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## త్రిశక్తి దేవాలయానికి విరాళం

జయభేరి, గజ్వేల్, మర్చి 06 :

అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని మ్యాకల కనకయ్య ముదిరాజ్ అన్నారు.గురువారం సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లో నూతనంగా నిర్మించిన త్రిశక్తి దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవంలో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మర్కుక్ మండల బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.త్రిశక్తి దేవాలయం కమిటీ సభ్యులకు 10,116 రూపాయలు విరాళం అందజేశారు, అనంతరం మ్యాకల కనకయ్య ముదిరాజ్ మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని, త్రిశక్తి దేవాలయం శ్రీ పెద్దమ్మ, శ్రీ మహంకాళి,శ్రీ నల్ల పోచమ్మ అమ్మవార్ల దేవాలయం నిర్మించడం అభినందనీయం అని,ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, అన్నారు ముదిరాజ్ సంఘం వారిని ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మర్కుక్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు రామరాజు,ఆలయ కమిటీ సభ్యులు,ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ గెలుపు తో విజయోత్సవ సంబరాలు

జయభేరి, వర్గల్, మర్చి 06 :

మెదక్, కరీంనగర్, నిజామాబాద్,ఆదిలాబాద్ గ్రాడ్యువెట్ ఎమ్మెల్సీ మరియు టీచర్స్ ఎమ్మెల్సీ లో కాషాయ జెండా ఎగిరిన సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గం లోని వర్గల్ మండల కేంద్రంలో బిజెపి నాయకులతో కలిసి మండల పార్టీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్ రెడ్డి టపాసులు కాల్చి ఒకరు ఒకరు స్వీట్లు తినిపించుకొని ఆనంద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఢీల్లీ అయినా గల్లీ అయినా బీజేపీ తోనే అని నరేంద్ర మోదీ తోనే మేమంతా అని చాటిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరడం కాయం అని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నేతలు నాయకులు పాల్గొన్నారు.

## గజ్వేల్ లో బాక్స్ క్రికెట్ ప్రారంభం

- బాక్స్ క్రికెట్ ను ప్రారంభిస్తున్న గజ్వేల్ సిఐ సైదా



జయభేరి, గజ్వేల్, మర్చి 06 :

గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ గ్రౌండ్ లో బాక్స్ క్రికెట్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ ను గజ్వేల్ సీఐ సైదా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్రికెట్ పట్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో ఎంతో క్రేజ్ ఉందని, గజ్వేల్ పట్టణం క్రీడాకారులకు వినియోగించుకోవాలన్నారు.. యువతలో క్రికెట్ ను ప్రోత్సహించేందుకు,గజ్వేల్ లో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్ గౌడ్, నిర్వాహకులు శివకుమార్, సూర్యకుమార్, బాలు,తలకుల రాజేశం, పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ గెలుపు.. జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో సంబురాలు...

- పటాకులు కాల్చి,స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు



జయభేరి, సిద్దిపేట, మర్చి 06 :

ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి శ్రీ డా చిన్నమైల్ అంజి రెడ్డి విజయం సాధించిన సందర్భంగా బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట పట్టణంలో టపాసులు కాల్చి మిఠాయి పంచి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్ రెడ్డి , ఉమ రెడ్డి, పద్మ, వినోద, రాధ, గుండ్ల జనార్ధన్, పత్రి శ్రీనివాస్ , తొడుపునూరి వెంకటేశం, కోడూరి నరేష్,బసంగారి వెంకట్ , బంధారం కనకరాజు అంబడిపల్లి శ్రీనివాస్,కెమ్మసారం సంతోష్ కుమార్, పుల్లయ్య గారి వెంకట్ , పాం పడిగే వేణు, మోతుకు శ్రీనివాస్, తాటికొండ శ్రీనివాస్ , వెంకట్ రావు, ఎల్లం,కసనగొట్టు సంతోష్, దాబా నరేష్,బొడ్డు సునీల్, రాపల్లి శ్రీనివాస్,లక్కరాసు కృష్ణ, రాగరం శ్రీను,సుతారి కార్తిక్, యాదగిరి ,శశి ,కమ్మ శ్రీను, బోదసు కనకరాజు, భాషా శ్రీకాంత్ , యాదన్ రావు, మహేందర్, గుర్రం వెంకట్ , దొంతుల సురేష్, చిన్న, సాయిబాబా, పెంబర్ల యాదగిరి , అరిగే యాదగిరి, గందే సంతోష్, కిరణ్ , గణేష్,రాజు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు

- ముఖ్య అతిధి గా పాల్గొన్న బీజేపీ జిల్లా నాయకులు బైరి శంకర్, వెంకటరమణ



జయభేరి, గజ్వేల్, మర్చి 06 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద బిజెపి నాయకులు కరీంనగర్, మెదక్ నిజామాబాద్, అదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాదించడంతో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్,బీజేపీ రాష్ట్ర ఐటి సెల్ నాయకులు ఏర్పుల వెంకటరమణ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి విజయం కట్టబెట్టిన ఉపాధ్యాయులకు, పట్టబదులందరికీ ధన్యవాదాలు అని రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపి అందిస్థానాలు కైవసం చేసుకుంటుందని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కాదని ప్రజలు బిజెపి కె మద్దతు తెలపడంపై ప్రజలు బిజెపి వైపే ముగుచూపుతున్నారననే దానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణలో ఏ ఎన్నిక జరిగిన బిజెపి విజయ విజయ డంక మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు యేల్లు రామిరెడ్డి, ఉప్పల మధుసూదన్, జశ్వంత్ రెడ్డి, పెడిచెడ్ వెంకటరెడ్డి, రామచంద్ర రెడ్డి, కొన్నె రాజిరెడ్డి, టేకులపల్లి రామ్ రెడ్డి, చిలువేరి జనార్ధన్, శశిధర్ రెడ్డి, లక్ష్మీ నరసింహ రెడ్డి, ఏగొండ, గర్నెపల్లి కృష్ణమూర్తి,సూర్యరావు, పెండ్యాల శ్రీనివాస్, బారు అరవింద్, ఐల మహేందర్, కొన్నె రాజశేఖర్ రెడ్డి, పంజాల వెంకట్ గౌడ్, మంద వెంకట్, దేవేందర్, సురేష్,రమేష్,గణపతి, బయ్యారం నరసింహారెడ్డి, రవి,కహిత రవీందర్ రెడ్డి, గుర్రం శ్రీధర్, రెక్సీ గౌడ్, శేఖర్ గౌడ్, బైరి రవి,మంతూరి మమత,సరిత,సుమతి, భక్తమాల, నరసింహ చారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్వీయం హాస్పిటల్ లో అరుదైన శాస్త్ర చికిత్స

- ఆరోగ్యశ్రీ ద్వారా (ఉచితంగా) ఆపరేషన్ చేసిన ఆర్వీయం వైద్యబృందం




జయభేరి, ములుగు, మర్చి 06 :

ఆర్వీయం హాస్పిటల్ లో అరుదైన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ తో బాధపడుతున్న ఓ రోగికి శాస్త్ర చికిత్స చేసి కనతిని తొలగించారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలోని ఆర్వీయం ఆసుపత్రి లో ఈ ఘటన చోటుచేసుకుంది...ఈ సందర్భంగా ఆర్వీయం హాస్పిటల్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో హాస్పిటల్ సూపరిండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ హాస్పటల్లో ఇప్పటికే అనేక రకాల చికిత్సలు నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలోనే గత ఎనిమిది నెలల కిందట క్యాన్సర్ చికిత్సను సైతం ప్రారంభించామని అన్నారు.

ఆంకాలజీ శస్త్ర చికిత్సలు, రేడియేషన్ థెరపి, కీమో థెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇందులో భాగంగానే హనుమకొండ జిల్లా నడికుడ మండలం, రామకృష్ణాపుర గ్రామానికి చెందిన ఎరుకల సాంబయ్య(65) కడుపు నొప్పితో బాధపడుతూ నగరంలోని ప్రముఖ హాస్పిటల్ లో చికిత్స చేయించుకునే ప్రయత్నం చేసి చివరకు ఆర్వీయం హాస్పిటల్ కి వచ్చారని అన్నారు. అయితే వారికి ప్యాంక్రియాటిస్ క్యాన్సర్ తో కూడిన ఒక భారీ కనితిని గుర్తించడం జరిగిందని అన్నరు. దీంతో మా వైద్యుల బృందమైన జనరల్ సర్జన్ టి శ్రీనివాస్, సర్జికల్ ఆంకాలజిస్ట్ ఎంఎస్ఎస్ కీర్తి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ సుబ్రహ్మణ్యేశ్వర బాబు, అనేస్తీసియ వైద్యుడు వంశీ కిరణ్ లు కలసి 10 గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించడం జరిగిందని. సాంబయ్య కడుపులోని క్యాన్సర్ కనితిని విజయవంతంగా తొలగించి ఆర్వీయం హాస్పిటల్ శస్త్ర చికిత్సలో మరో మైలురాయి ని సాధించామని అన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఇంతటి అరుదైన చికిత్సను పూర్తి చేయడం ఇలాంటి రోగులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర బాబు మాట్లాడుతూ..కడుపు లోపల చేసే అరుదైన శస్త్ర చికిత్సలో సాంబయ్యకు చేసింది విశేషమైనదని అన్నారు. ఆర్వీయం లో అన్ని రకాల పరికరాలతో పాటు ఉత్తమైన వైద్య బృందం, నర్సింగ్ కేర్ వల్లే చికిత్స విజయవంతంగా పూర్తయి రోగి పూర్తి ఆరోగ్యంతో 12 రోజులలోనే డిస్చార్జ్ అవ్వడం జరుగుతున్నదని తెలిపారు.రోగి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సాంబయ్యను నగరంలోని రెండు ప్రముఖ హాస్పిటల్స్ కి చికిత్స కోసం తీసుకువెళ్లామని, రూ.8 నుంచి 10 లక్షలు ఖర్చు అవుతుందని అన్నారన్నారు. నిరుపేదలమైన తాము అంతటి ఖరీదైన చికిత్స చేసుకోలేమని వాపోతున్న తరుణంలో ఆర్వీఎం హాస్పిటల్స్ గురించి తెలుసుకొని ఇక్కడికి వచ్చామని అన్నారు. ఇక్కడి వైద్య బృందం రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా ఇంతటి కఠినమైన శస్త్ర చికిత్స ను విజయవంతంగా పూర్తి చేసి సాంబయ్యకు పునర్జన్మను ప్రసాదించారని అన్నారు. తమ కుటుంబం అంతా ఆర్వీయం హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.

# కాంగ్రేస్ పార్టీ అంటేనే పేదల పార్టీ



- సోదా రామకృష్ణ
- పేదల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

జయభేరి, పరకాల, మార్చి 06:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి లతోనే పరకాల అభివృద్ధి చెందుతుంది అని, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ అన్నారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపల్ లోని 16వ వార్డు లో బండి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సోదా రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు పథకాలను అమలు చేయడమే కాంగ్రెస్ పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశం. కానీ కొన్ని పార్టీలు పనిగట్టుకొని కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే కార్యక్రమం చేస్తుంది వారిని ప్రజలే తిప్పి కొట్టాలని, వారికి బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, సమన్వయ కమిటీ సభ్యులు ఎండి రంజాన్ అలీ, చిన్నాల గోనాద్, ఒంటేరు రామ్మూర్తి, పావుశెట్టి వెంకటేశ్వర్లు, మడికొండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ మడికొండ సంపత్ కుమార్, పంచగిరి జయమ్మ, ఏకు రాజు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కలను కాంగ్రేస్ నిజం చేస్తుంది

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమంలో వ్యాఖ్య
- ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం



జయభేరి, పరకాల, మార్చి 06:

పేద ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిజం చేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం సంగెం మండలం కేంద్రం షాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళకు ముగ్గుపోసి, భూమిపూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొంతింటి కల సహకారం కోసం ప్రజలు పదేళ్లుగా ఎదురు చూశారని, ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. బడుగు వర్గాల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇల్లు అని, వీటి పట్టాల పేరు మహిళల పేరు మీదనే ఉంటాయని అన్నారు. పనులు జరుగుతున్న క్రమంలో నిధులు విడుదల చేయడం జరుగుతుందని త్వరగా పనులు పూర్తిచేయాలని లబ్ధిదారులకు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేస్తామని ఇండ్ల కోసం ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు అవుతాయన్నారు.

# విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

- బొచ్చు కళ్యాణ్ ఎస్ఎఫ్ఐ నాయకులు
- టాలెంట్ టెస్ట్ మండల విజేతగా శారద హై స్కూల్ విద్యార్థి నేరెళ్ల వంశీ



జయభేరి, పరకాల, మార్చి 06:

గురువారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో టెన్త్ టాలెంట్ టెస్ట్ విజేతల బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే ప్రయత్నంగానే ప్రతి సంవత్సరం టెన్త్ టాలెంటేస్ట్ నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థులంతా తమ తల్లిదండ్రుల ఆశయాల కోసం గురువుల ఆధ్వర్యంలో చదువుకొని పైకెదగాలని అన్నారు. సమాజంలోని సామాజిక రుగ్మతలకు అసమానతలకు వ్యతిరేకంగా వాటి పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల స్థాయి మొదటి బహుమతి గెలుచుకున్న శారద హై స్కూల్ విద్యార్థి నేరెళ్ల వంశీకి, రెండవ బహుమతి మల్కాపేట సోషల్ వెల్ఫేర్ విద్యార్థి శ్రీజ లకు శాలువాతో సత్కరించి ఎగ్జామ్ ప్యాడ్, షీల్డ్ లను బహూకరించారు. అలాగే పాఠశాల స్థాయి లో పాల్గొన్న వివిధ విద్యార్థులకు లిటిల్ ఫ్లవర్ స్కూల్ నుండి సిరి, ఎస్ అర్ స్కూల్ నుండి టి దీప్తి, గర్ల్స్ హై స్కూల్ నుండి కీర్తన, ఆత్మకూర్ సోషల్ వెల్ఫేర్ నుండి ఎం త్రివేణి, శారదా స్కూల్ నుండి షేక్ హసన్, బాయ్స్ హై స్కూల్ నుండి రవితేజ, బాలాజీ స్కూల్ నుండి జి. సాయి దృతి, చైతన్య స్కూల్ నుండి రక్షిత లను గర్ల్స్ హై స్కూల్ ప్రిన్సిపల్ మధు చేతుల మీదుగా, అలాగే పాఠశాల ఉపాధ్యాయుల చేతులమీదుగా ఎగ్జామ్ ప్యాడ్, షీల్డ్ లను బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, పరకాల మండల అధ్యక్షులు మడికొండ ప్రశాంత్, పరకాల పట్టణ అధ్యక్షులు బొచ్చు ఈశ్వర్, అలాగే ఉపాధ్యాయులు పుష్ప, రమాదేవి, సాంబయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.




## కేశవరం లోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష కిట్ ల అందచేత

- విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడాలి అని సూచన

జయభేరి, మర్చి 06:

మూడుచింతలపల్లి మండలం కేశవరం లోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్షల కిట్ ను అంద చేశారు. కాగా ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ముందుగా భయాన్ని విడనాడాలన్నారు. సొసైటి సభ్యులు మరియు డోనర్ నాగేష్ తన తల్లి రోజమ్మ గారి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మార్పుకు గ్రామ పంచాయతీ ఆమోదం




జయభేరి, పరవాడ :

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పి బోనంగి పంచాయితీ శివారు వీఎల్ఎన్ పురం(కొత్తూరు) జాజులు వాని పాలెం నుండి కలపాక వెళ్ళు ప్రధాన రహదారి పక్కన ఎంపీపీ స్కూల్ దగ్గర విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ శిథిలావస్థలో ఉందని దాన్ని అక్కడ నుంచి మార్చాలని ఇటీవల ఎమ్మెల్యే పంచకర్ల నిర్వహించిన సమీక్షా సమావేశంలో గ్రామ ప్రజలు విన్నవించుకొన్నారు. ఆ సమస్యపై ప్రధాన రహదారిని అనుకోని నూతనంగా నిర్మిస్తున్న కాలువ నిర్మాణానికి అడ్డంకి గా మారిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి అయ్యే ఖర్చు అంచనా వేయాలని వేసిన ఖర్చును గ్రామపంచాయతీ సాధారణ నిధుల నుండి ఖర్చు చేయుటకు పంచాయతీ నిర్ణయించుకున్నట్టు గ్రామపంచాయతీ తీర్మానాన్ని గ్రామ సెక్రెటరీ శ్రీనివాసరావు కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్కు పంపించడం జరిగింది. ఈ నిర్ణయం పట్ల వీఎల్ఎన్ పురం గ్రామ ప్రజలు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యాజమాన్యం ఆదేశానుసారం పవర్ ప్రోగ్రాం

జయభేరి, దేవరకొండ :


దేవరకొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, అద్దె బస్సు డ్రైవర్లకు, సూపర్వైజర్లు, కంట్రోలర్ లకు యాజమాన్యం ఆదేశానుసారం పవర్ ప్రోగ్రాం గురువారం విజయవంతంగా పూర్తయిందని డిపో మేనేజర్ తల్లాడ రమేష్ బాబు తెలిపారు. గత పది రోజులుగా సిబ్బందికి ప్రయాణికుల పట్ల నడుచుకోవాల్సిన పద్ధతులు, విధివిధానాల పై పవర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో విసుక్కోకుండా మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, ఓర్పు, సహనం, ఆత్మవిశ్వాసం, నిజాయితీతో విధులు నిర్వహించే విధంగా పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ పురోభివృద్ధికి తోడ్పాటునందించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసినందుకు డిపో మేనేజర్ రమేష్ బాబును ఆర్టీసీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, స్టేషన్ మేనేజర్ దీప్ లాల్, నారాయణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి సినిమా

07-03-2025

శుక్రవారం

jayabheridaily.com



## 'హరిహర వీరమల్లు' నుంచి కొల్లగొట్టినాదిరో రిలీజ్

నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం హరిహర వీరమల్లు. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మాట వినాలి అనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా సెకండ్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా నుంచి కొల్లగొట్టినాదిరో అనే రెండో సింగిల్ ప్రోమోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. కోర కోర మీసాలతో కోదమ కోదమ అడుగులతో.. జర జర వచ్చినాడు చిచ్చర పిడుగంటివాడు అంటూ విడుదల చేసిన ప్రోమో గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ సినిమాలో చాలా రోజుల తర్వాత ఒక సూపర్ హిట్ సాంగ్ రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ పాటలో నిధి ఆగర్వాల్‌తో పాటు అనసుయ కూడా తళుక్కున మెరిసింది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## 3 నిమిషాలకు 3 కోట్ల రెమ్యునరేషన్..

ఆమె కెరీర్ లో ఒక్క హిట్ కూడా లేదు. కానీ కేవలం మూడు నిమిషాల కోసం ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుంది. ఆమె గ్లామర్ పాత్రలకు.. స్పెషల్ సాంగ్స్ కు కేరాఫ్ అడ్రస్. సన్నీ డియోల్‌తో అరంగేట్రం చేసి హృతిక్ రోషన్‌తో సహా అనేక మంది సూపర్‌స్టార్‌లతో కూడా పనిచేసింది. ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ అమ్మడు జోరు కొనసాగుతుంది. ఇంతకీ ఆమె ఎవరో కాదు.. హీరోయిన్ ఊర్వశి రౌతేలా. సినిమా రంగంలోకి రాకముందు అనేక అందాల పోటీలలో గెలిచింది ఈ ముద్దుగుమ్మ. అయితే సినీరంగం మాత్రం ఈ బ్యూటీకి కలిసిరాలేదు. అయినప్పటికీ ఆమె క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. నిమిషానికి కోటి చొప్పున మూడు నిమిషాల కోసం రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుంది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ ఊర్వశీ రౌతేలా. ఇప్పటికే హిందీ, తెలుగులో అనేక చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. ఇటీవలే నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. ఇందులో 3 నిమిషాల పాట కోసం రూ.3 కోట్లు పారితోషికం తీసుకున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఊర్వశి రౌతేలా ఆస్తుల విలువ రూ. 236 కోట్లు అని సమాచారం. ఆమెకు ఇన్ స్టాలో 73 మిలియన్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఊర్వశి రౌతేలా 2013లో సన్నీ డియోల్ సరసన సింగ్ సాబ్ ది గ్రేట్ చిత్రంతో తెరంగేట్రం చేసింది. ఆ సమయంలో ఆ నటి వయసు కేవలం 19 సంవత్సరాలు. సింగ్ సాబ్ ది గ్రేట్ బాక్సాఫీస్ వద్ద సూపర్ ఫ్లాప్ అయింది. ఆ తర్వాత ఆమె నటించిన చిత్రాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి పదేళ్లు గడుస్తున్నప్పటికీ ఆమె ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. ఇప్పటికీ ఈ అమ్మడికి సరైన బ్రేక్ రాలేదు. కానీ స్పెషల్ పాటలతో ఓ రేంజ్ క్రేజ్ సొంతం చేసుకుంది.



## సెల్ఫీ కోసం వచ్చి ఏకంగా..

సాధారణంగా సినీతారలకు అభిమానుల నుంచి చాలా సందర్భాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో సెల్ఫీల కోసం వచ్చి హీరోయిన్లను ఇబ్బందులకు గురి చేస్తుంటారు పలువురు ఆకతాయిలు. తాజాగా ఓ హీరోయిన్ కు సైతం ఊహించని షాకిచ్చాడు ఓ అభిమాని. బాలీవుడ్ ఇండస్ట్రీలో ఒకప్పుడు స్పెషల్ పాటలకు కేరాఫ్ అడ్రస్ ఆమె. కానీ కొన్నాళ్లుగా ఆమె క్రేజ్ పూర్తిగా పడిపోయింది. ఇక ఆ తర్వాత ఎప్పుడూ వివాదాలతోనే వార్తలలో నిలిచింది. తాజాగా సెల్ఫీ కోసం వచ్చిన అభిమాని చేసిన పనికి షాకయ్యింది. ఆమె మరెవరో కాదు.. బీటౌన్ బ్యూటీ పూనమ్ పాండే. ఇప్పటికే ఎన్నోసార్లు వివాదాలతో వార్తలలో నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీకి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతుంది. ముంబై వీధుల్లో పూనమ్ పాండేను ఓ అభిమాని బలవంతంగా ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. దీంతో పూనమ్ పాండే భయపడి పక్కకు తప్పుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతుంది. తాజాగా ముంబై వీధుల్లో కనిపించిన పూనమ్ పాండేను పాపరాజ్జీలు ఫోటోస్ తీయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో ఓ అభిమాని వచ్చి పూనమ్ తో సెల్ఫీ కావాలని అడిగాడు. దీంతో ఆమె అంగీకరించింది. పూనమ్ పాండే కూడా ఒక అడుగు దూరం నుండి సెల్ఫీ తీసుకోవడానికి ఒప్పుకుంది. కానీ ఆ వ్యక్తి మరింత దగ్గరగా వచ్చి పూనమ్ కు ముద్దు పెట్టేందుకు ప్రవర్తించాడు. అప్పుడు పూనమ్ పాండే భయంతో వెనక్కు జరిగింది. అయితే ఈ వీడియో చూసిన నెటిజన్స్ విభిన్నంగా కామెంట్స్ చేస్తున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన డ్రామా అని కొందరు అంటున్నారు. ఈ డ్రామా ముందుగానే ప్లాన్ చేసుకున్నదని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ వీడియో ప్రస్తుతం చాలా వైరల్ అవుతోంది.పూనమ్ పాండే నాటకం ఒకటి రెండు కాదు. అంతకుముందు, అతనే తన మరణానికి సంబంధించిన నకిలీ వార్తలను ప్రచారం చేసింది.



## అతిథి పాత్రలో హరీశ్‌శంకర్

అతిథి పాత్రలో హరీశ్‌శంకర్ ప్రముఖ దర్శకుడు హరీశ్‌శంకర్ వెండితెరపై అతిథి పాత్రలో మెరవనున్నారు. 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో ఆయన కీలకమైన గెస్ట్‌రోల్‌ను పోషించారు.

ప్రముఖ దర్శకుడు హరీశ్‌శంకర్ వెండితెరపై అతిథి పాత్రలో మెరవనున్నారు. 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో ఆయన కీలకమైన గెస్ట్‌రోల్‌ను పోషించారు. సుహాస్, మాళవిక మనోజ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ గోధల దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మాత. ఈ వేసవిలో సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. 'హరీశ్‌శంకర్ అతిథి పాత్ర అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ పాత్ర ఆయన చేస్తేనే బాగుంటుందని భావించాం. హరీశ్‌శంకర్‌కు సంబంధించిన సన్నివేశాలను ఇటీవలే పూర్తి చేశాం. ఆద్యంతం వినోదంతో ఆకట్టుకునే చిత్రమిది' అని మేకర్స్ తెలిపారు. అనితా హసనందిని, అలీ, పృథ్వీరాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రధన్, రచనదర్శకత్వం: రామ్ గోధల.


Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com